సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 6 । జూన్ । 2023



సింగరేణిలో 'దశాబ్ది' సంబురాలు
సింగరేణి ఆధ్వర్యంలో కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందులో రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు నిర్వహించారు. 8లో



చార్ నంబర్.. చోర్
సుజాతనగర్ నగల దుకాణంలో చోరీ ఘటనలో నలుగురు నిందితులు పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 28°

వాతావరణం
జిల్లాలో మంగళవారం ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది. గంటగంటకూ ఉష్ణోగ్రతలు పెరుగుతూ ఉంటాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. జ్యేష్టాభిషేకం సందర్భంగా నిలిపివేసిన నిత్యకల్యాణాన్ని సోమవారం యథావిధిగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

8న గోదావరికి మహాహారతి

భద్రాచలంటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో ఈనెల 8న జరిగే భద్రాద్రి గోదావరి.. మహాహారతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సమితి అధ్యక్షుడు బూసిరెడ్డి శంకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పవిత్ర జీవనదులను కాపాడుకుందామనే నినాదంతో గోదావరి మహా హారతి వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ మధ్యప్రదేశ్ ఇంచార్జ్ పొలసాని మురళీధర్‌రావు, పలువురు స్వామీజీలు చేపట్టిన పాదయాత్ర ఈనెల 8న భద్రాచలం చేరుకుంటుందని పేర్కొన్నారు. అదేరోజు సాయంత్రం నిర్వహించే గోదావరికి మహా హారతి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ వ్యవహారాల్లో ఇతరుల జోక్యం తగదు

సుజాతనగర్: ఆలయ వ్యవహారాల్లో ఇతర వ్యక్తుల జోక్యం తగదని దేవాదాయ, ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప సంచాలకులు శ్రీకాంత్‌రావు అన్నారు. స్థానిక శివాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ సరిహద్దుల్లో నిర్మించిన కట్టడాలను పరిశీలించారు. ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాలు, నిలిచిపోయిన పనుల గురించి కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని, అర్చకులు సమయపాలన పాటించాలని సూచించారు. ఆలయ భూమి కొంత ఆక్రమణకు గురైందని కమిటీ సభ్యులు చెప్పగా సర్వే చేయించాలని సూచించారు. కార్యక్రమంలో అర్చకులు చొప్పకట్ల జనార్ధన శర్మ, ఆలయ చైర్మన్ అన్నపురెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, కమిటీ సభ్యులు ప్రసాద్, భూక్యా శోభన్, గడ్డం వీరరాజశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ కార్యక్రమాల్లో ముందుండేలా కృషి

కొత్తగూడెంఅర్బన్: అన్ని జాతీయ కార్యక్రమాల్లో జిల్లాను ముందంజలో ఉంచేందుకు కృషి చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇమ్యునైజేషన్‌లో జిల్లాను రెండో స్థానంలో నిలిపినందుకు డీఎంహెచ్‌ఓ, ప్రోగ్రాం అధికారులను, సిబ్బందిని అభినందించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ శిరీష మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రోగ్రామ్‌ల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా టీబీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీవాసరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజ్‌కుమార్, ప్రోగ్రామ్ అధికారులు మణికంఠారెడ్డి, డాక్టర్ చైతన్య, డిప్యూటీ డెమో ఫైజ్‌మొయిద్దీన్, వైద్యాధికారిణి స్పందన, సీహెచ్‌ఓ నాగభూషణం పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ ప్రారంభం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జనరల్ కోర్సుల్లో 14కు 12 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 70కి 40 మంది హాజరు కాగా, 32 మంది గైర్హాజరయ్యారు. ఐపీఏఎస్‌ఈ ఒకేషనల్ కోర్సులో 48కి 35 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు 9వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈనెల 12 నుంచి ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలు జరుగుతాయని డీఐఈఓ సులోచనరాణి తెలిపారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.స్వప్నకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరానికి టీజీయూజీసీఈటీలో ఉత్తీర్ణత సాధించి కళాశాలకు ఎన్నికైన విద్యార్థులు ఈ నెల 12 లోపు ధ్రువపత్రాలు, టీజీయూజీసీఈటీ హాల్‌టికెట్, ఎస్సెస్సీ, ఇంటర్ మెమో, 6 నుంచి 12 వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు ఒరిజినల్స్, మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు.

మూడింట ముడిపడట్లే !

మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణాల్లో జాప్యం
- ఇల్లెందు, పినపాకలో మాత్రమే పూర్తి
- చుంచుపల్లిలో పనులు నత్తనడకనే..
- పాల్వంచ ట్యాంక్‌బండ్ ఇంకా టెండర్ల దశలోనే



పాల్వంచలో మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దనున్న చింతలచెరువు

పాల్వంచ : తెలంగాణ ఆవిర్భావం తర్వాత పట్టణాలు, గ్రామాలు పురోగతి సాధిస్తున్నాయి. మౌలిక వసతుల కల్పనతో పాటు రూపురేఖలు మార్చి, సరికొత్త ఆహ్లాద వాతావరణం ఏర్పడే దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో నియోజకవర్గాల వారీగా చెరువులను అభివృద్ధి చేసి, మినీ ట్యాంక్‌బండ్‌ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లాలో భద్రాచలం మినహా మిగిలిన నాలుగు నియోజకవర్గాలకు గాను ఐదు ట్యాంక్‌బండ్‌ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలో చుంచుపల్లి, పాల్వంచల్లో నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు గాను 2016లో మూడు, 2018లో రెండింటికి నిధులు మంజూరు చేసింది. ఎంపిక చేసిన చెరువులపై రోడ్లు, పార్కులు, బెంచీలు, సెంట్రల్ లైటింగ్, బతుకమ్మ గార్డెన్‌లు, ఇతర సుందరీకరణ పనులు చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఐదేళ్లు దాటినా మూడు చోట్ల పనులు పూర్తి కాలేదు. పాల్వంచలో ఇంకా టెండర్ల దశలోనే ఉండడం గమనార్హం. ఇల్లెందు, పినపాకలో మాత్రం పూర్తయ్యాయి.



జిల్లాలో ఇదీ పరిస్థితి..

- కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో చుంచుపల్లి మండలం చింతలచెర్వు కింద సుమారు 20 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా తీర్చిదిద్దేందుకు 2016లో రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. ఏడేళ్లయినా ఇంకా 75 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. సివిల్ పనులు అయిపోయినప్పటికీ.. రోడ్లు, పార్కులు, పచ్చదనం, సుందరీకరణ చేయాల్సి ఉంది.
- పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని పాత పాల్వంచ చింతలచెరువు వద్ద మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా ప్రతిపాదనలు ఉన్నా.. ఇటీవల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద గతేడాదే ఎంపిక చేశారు. ఈ చెరువు పక్కనే ప్రాచీన శ్రీ ఆత్మలింగేశ్వర ఆలయం ఉండటం, ఇక్కడికి నిత్యం భక్తులు అధిక సంఖ్యలో వస్తుండడంతో పాటు, కొమ్ముగూడెం, పాత పాల్వంచ రాకపోకలకు ఈ చెరువు రోడ్డు వారధిగా ఉంటుంది. దీంతో ఈ కట్ట అభివృద్ధికి రూ.10 కోట్లు విడుదల చేశారు. ఈ పనులు ఇంకా టెండర్ల దశలోనే ఉన్నాయి.
- ఇల్లెందులోని ఇల్లెందులపాడు చెరువు అభివృద్ధికి 2018లో రూ.4.53 కోట్లు మంజూరయ్యాయి. ఇక్కడ రోడ్లు, వాకింగ్ ట్రాక్, లైటింగ్, బతుకమ్మ ఘాట్‌లు పూర్తి చేశారు. మరికొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి.
- అశ్వారావుపేటలో వెంకమ్మ చెరువు అతి పెద్దది కాగా, దీని కింద 1,297 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువుపై మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణానికి 2016లో రూ. 5.80 కోట్లు విడుదల చేశారు. ఏడేళ్లయినా ఇంకా 10 శాతం పనులు మిగిలే ఉన్నాయి.



అశ్వారావుపేట వెంకమ్మ చెరువుపై పూర్తి కావొచ్చిన పనులు

- పినపాక నియోజకవర్గంలో మణుగూరు మున్సిపాలిటీ కేంద్రంలో నాయుడుపేట చెరువుపై మినీ ట్యాంక్‌బండ్ పనులకు 2016లో రూ.2.23 కోట్లు మంజూరయ్యాయి. ఇక్కడ పనులు పూర్తయ్యాయి.
- ఇక భద్రాచలం నియోజకవర్గంలో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంపై అధికారులు అసలు దృష్టి సారించనే లేదు. భద్రాచలంలో లేదంటే చర్ల, దుమ్ముగూడెంలో ఎక్కడ ఒకచోట మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

మారనున్న రూపురేఖలు..

ఇప్పటివరకు కార్పొరేషన్‌లకే పరిమితమైన ట్యాంక్‌బండ్‌లను కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గాలు, ముఖ్యంగా మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేస్తున్నారు. ట్యాంక్‌బండ్‌ల నిర్మాణంతో ఆయా పట్టణాల ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్, ఎక్సర్‌సైజ్ చేసేందుకు ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుంది. అలిసిపోయినప్పుడు సేద తీరేందుకు పార్కులు, బెంచీలు ఉంటాయి. పిల్లలు ఆడుకునేందుకే ప్రత్యేక వసతులు ఏర్పాటు చేస్తారు. ట్యాంక్‌బండ్‌ల నిర్మాణాలతో ఆయా ప్రాంతాల రూపురేఖలు మార్చాలని, ఎక్కువ మంది వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రజలను ఆకర్షించేందుకు సుందరీకరణ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఈ ఏడాది చివరినాటికి పూర్తి చేస్తాం



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో మినీ ట్యాంక్ బండ్‌ల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే ఇల్లెందు, మణుగూరులో పనులు పూర్తయ్యాయి. చుంచుపల్లి, అశ్వారావుపేటల్లో ఇంకొంత పెండింగ్‌లో ఉన్నాయి. పాల్వంచలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు సాధ్యమైనంత త్వరగా చేపడుతాం. ఈ ఏడాది చివరినాటికి అన్ని చోట్లా పనులు పూర్తి చేస్తాం.

– డి.అర్జున్, ఇరిగేషన్ ఈఈ

తెలంగాణలోనే నిరంతర సరఫరా

విద్యుత్ విజయోత్సవంలో ఎమ్మెల్యే వనమా, ఎమ్మెల్సీ మధు, కలెక్టర్ అనుదీప్




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వనమా, పక్కన ఎమ్మెల్సీ తాతా మధు, కలెక్టర్ అనుదీప్

చుంచుపల్లి: దేశంలో అన్ని రంగాలకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం చుంచుపల్లి మండలంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గతంలో కరెంటు కోతలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడేవారని, తెలంగాణ వచ్చాక ఈ సమస్యను అధిగమించామని చెప్పారు. గతంలో ఓ గ్రామానికి ట్రాన్స్‌ఫార్మర్ వస్తే పండుగ చేసుకునేవారని, ఇప్పుడు అడిగిన వారందరికీ సరఫరా చేస్తూ లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించుకున్నామని తెలిపారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ గతేడాది గోదావరి వరదల సమయంలో విద్యుత్ శాఖ సిబ్బంది ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. గోదావరి పరీవాహక మండలాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడిన దాదాపు 200 గ్రామాలకు 48 గంటల్లోనే సరఫరా పునరుద్ధరించారని అభినందించారు. జిల్లాలో 2014కు ముందు 39 సబ్‌స్టేషన్లు ఉండగా, ఇప్పుడా సంఖ్య 73కు పెరిగిందని చెప్పారు. ఇంకా అవసరమైన చోట సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి.

కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమేష్, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, జెడ్పీ సీఈఓ విద్యాలత, ఎన్‌కే నగర్ సర్పంచ్ సుగుణ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి ఎంపీపీలు బదావత్ శాంతి, భూక్యా సోను, డీఈలు వెంకటరత్నం, శేషాద్రి, ఏడీఈలు హేమచంద్ర, ప్రభాకర్, యాసిన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రూప్ -1' ప్రశాంతంగా నిర్వహించాలి

కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 11న గ్రూప్–1 పరీక్షను ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. పరీక్ష నిర్వహణపై సుజాతనగర్, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ తహసీల్దార్లు, పరీక్ష కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో వీసీ ద్వారా మాట్లాడారు. జిల్లాలో 22 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 8,851 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్ష ఉంటుందని, 8.30 నుంచే లోపలికి అనుమతిస్తారని, 10.15 తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ప్రతీ కేంద్రంలో తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఏర్పాట్లపై నివేదిక అందజేయాలని తెలిపారు. రూట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లకు మాత్రమే సెల్‌ఫోన్ అనుమతి ఉంటుందన్నారు. అన్ని కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, దివ్యాంగులకు మొదటి ఫ్లోర్‌లోనే సీట్లు కేటాయించాలని చెప్పారు. ఇన్విజిలేటర్లను లాటరీ పద్ధతిన కేటాయిస్తామని చెప్పారు. సమావేశంలో ఆర్‌టీఓ వేణు, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, విద్యుత్ టెక్నికల్ డీఈ వెంకటరత్నం, ఎస్‌బీ సీఐ సర్వయ్య పాల్గొన్నారు.

నేడు పారిశ్రామిక ప్రగతి ఉత్సవం

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పారిశ్రామిక ప్రగతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. వేడుకల నిర్వహణకు సమన్వయ బాధ్యతను జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ సీతారామ్‌కు అప్పగించినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని పారిశ్రామిక వాడలు, ఐటీ కారిడార్లలో సభలు నిర్వహించాలన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు, ప్రస్తుతం పరిశ్రమల స్థాపనకు ఏర్పడిన అవకాశాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

ఓటరు సవరణ పకడ్బందీగా చేపట్టాలి

ప్రత్యేక ఓటరు సవరణలో ఇంటింటి సర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ సూచించారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి సోమవారం ఆయన తహసీల్దారలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వచ్చేనెల 24 వరకు ఇంటింటి సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేయాలని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధులు కేటాయించిన ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం చేస్తే సస్పెన్షన్ వేటు తప్పదని హెచ్చరించారు. అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండే వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఆగస్టు 2న ముసాయిదా జాబితా ప్రకటించి 31 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, సెప్టెంబర్ 22 వరకు అభ్యంతరాలను పరిష్కరించి అక్టోబర్ 4న తుది జాబితా విడుదల చేస్తామని వివరించారు. సమావేశంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సురేష్‌కుమార్, ఏఓ గన్యా, సహాయకులు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే బహుజన రాజ్యం

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



సభలో మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

దమ్మపేట: పోరాటాలు, త్యాగాలతోనే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. దమ్మపేటలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీలో అవినీతిపై హైదరాబాద్‌లో శాంతియుతంగా ధర్నా చేస్తున్న బహుజనులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలపై తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడుతున్నామని తెలిపారు. బహుజనులు అధికారంలోకి వచ్చినప్పుడే పేదరికం, అసమానతలు తొలగిపోతాయని అన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన మహిళలను సైతం వదలకుండా కేసులు పెట్టే ఈ ప్రభుత్వం, ఏజెన్సీ ప్రాంతాల్లో వందల ఎకరాలున్న గడీలు, పెత్తందార్ల ఫామ్‌హౌస్‌లో కాలు పెట్టే సాహసం కూడా చేయలేదని విమర్శించారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు కట్టుకున్న పేదలను వెళ్లగొట్టే రెవెన్యూ అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న బడాబాబులకు మాత్రం కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ప్రతి నియోజకవర్గంలో బూత్ స్థాయి కమిటీలు ఉంటేనే గెలుపు సాధ్యమని, బూత్ కమిటీలో ఉన్న ప్రతి ఒక్కరూ బీఎస్పీ ఆశయాలు, సిద్ధాంతాలను ఓటర్లకు వివరించాలని పిలుపునిచ్చారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే అంతర్జాతీయ స్థాయి ఉచిత విద్య, ఉచిత వైద్యం, భూమిలేని మైదాన ప్రాంతాల వారికి ఎకరం భూమి, గల్ఫ్ ఉద్యోగులు, కౌలు రైతులకు సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

మిర్చి 'ధర'హాసం

- ఖమ్మం మార్కెట్‌లో క్వింటాకు రూ.24,500
- విదేశీ ఎగుమతులతో నిల్వ మిర్చికి డిమాండ్



జెండా పాటలో పాల్గొన్న వ్యాపారులు

ఖమ్మంవ్యవసాయం: మిర్చికి డిమాండ్ ధర పలుకుతోంది. వేసవి సెలవుల తర్వాత ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సోమవారం తెరుచుకోగా.. పలువురు రైతులు ఇళ్లలో, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచిన మిర్చిని విక్రయానికి తీసుకొచ్చారు. దీంతో మార్కెట్ బంద్ కాక ముందు ఉన్నట్లే ఇప్పుడు కూడా డిమాండ్ కొనసాగింది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికి జెండాపాటలో గరిష్టంగా రూ. 24,500 ధర పలకగా, మోడల్ ధర రూ.20 వేలు, కనిష్ట ధర రూ.18 వేలుగా నమోదైంది. ఇక ఇళ్లలో నిల్వ చేసిన మిర్చికి రూ.12,500 నుంచి రూ.20వేల వరకు ధర పలికింది. తాలు మిర్చికి సైతం గరిష్ట ధర రూ.12,500 పలకడం విశేషం.

నిల్వ మిర్చికి ఏటా డిమాండే..

ప్రతీ సంవత్సరం నిల్వ మిర్చికి మంచి డిమాండ్ ఉంటోంది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసే మిర్చికి అక్టోబర్, నవంబర్‌లో గరిష్ట ధరలు నమోదవుతుండగా, ఈసారి మే, జూన్‌లోనే అత్యధిక ధర పలికింది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన తేజా రకం మిర్చికి గరిష్టంగా 2020లో రూ.20 వేలు, 2021లో రూ.21 వేలు, 2022లో రూ.22 వేల ధర పలకగా.. ఈసారి మే 13న రూ.25,800, ఇప్పుడు రూ.25 వేల అంచుకు చేరడం విశేషం. ఇక నాన్ ఏసీ మిర్చికి కూడా మంచి ధర లభిస్తోంది. ప్రస్తుత సీజన్‌లో మార్చి 20వ తేదీన గరిష్టంగా రూ.25,550 పలికి చరిత్ర సృష్టించింది.

ఈ ఏడాది రికార్డు ధరలు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 'తేజా' రకం మిర్చికి ఈ ఏడాది రికార్డు ధర పలుకుతోంది. విదేశాల్లో ఈ రకం మిర్చికి డిమాండ్ ఉండటంతో ధరకు రెక్కలొచ్చాయి. గతనెల 13న ఖమ్మం మార్కెట్‌లో నిల్వ మిర్చి ధర రూ.25,800గా.. మార్చి 20వ తేదీన రూ.25,550గా ధర నమోదైంది. ఈ ధరలే ఆల్ టైం రికార్డు అని వ్యాపారులు చెబుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో ఆయన మొక్క నాటి మాట్లాడారు. మొక్కల పెంపకంతో కాలుష్యాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. ఆ తర్వాత న్యాయమూర్తులు, న్యాయవాదులు, అటవీ అధికారులు, కోర్టు సిబ్బంది మొక్కలు నాటారు. జిల్లా కోర్టు వద్ద పర్యావరణ ర్యాలీని జడ్జి ప్రారంభించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.శ్యాంశ్రీ, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రామారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, పీపీలు పోసాని రాధాకృష్ణమూర్తి, పీవీడీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఐటీసీ పీఎస్‌పీడీలో

బూర్గంపాడు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఐటీసీ పీఎస్‌పీడీ ఎన్విరాన్‌మెంట్ హెడ్ ప్రఫుల్ల కుమార్ సమంతసింగార్ అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐటీసీ, కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఐటీసీ ప్రాజెక్ట్ హెడ్ హరినారాయణ, మాన్యుఫ్యాక్చరింగ్ హెడ్ శైలేందర్ సింగ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కాలుష్య నివారణకు పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. కార్మికులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఐటీసీ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో టెక్నికల్ హెడ్ జయంత్‌కుమార్, సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) చెంగలరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసిన డీఈఓ



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖర శర్మ

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బడి ఈడు పిల్లలందరినీ సర్కారు బడుల్లోనే చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జూలూరుపాడులో ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పలువురు విద్యార్థులను పాఠశాలలో నూతనంగా అడ్మిషన్ చేయించారు. డీఈఓనే అడ్మిషన్ ఫామ్ పూర్తి చేసి ఉపాధ్యాయులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రతి విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్ ఇస్తున్నామని, ఈ విద్యాసంవత్సరం నుంచి నోట్ పుస్తకాలు కూడా ప్రభుత్వమే సరఫరా చేస్తోందని చెప్పారు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించి ఆర్థికంగా ఇబ్బంది పడవద్దని సూచించారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు 'మన ఊరు – మన బడి' కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్యా సోని, ఎంఈఓ గుగులోత్ వెంకట్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



గిరిజన దర్బార్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ గౌతమ్

భద్రాచలం: విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యాన గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫామ్ సిద్ధం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి గౌతమ్ పొట్రు ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఆయన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం సంబంధిత యూనిట్ అధికారులకు అందచేసిన ఆయన అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ 12వ తేదీన నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నందున, విద్యాసంవత్సరాన్ని ఘనంగా ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. గిరిజన దశాబ్ది ఉత్సవాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షాన నిర్వహించాలని తెలిపారు. కాగా, గురుకుల పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశాలు, పోడు భూమికి పట్టాలు, స్వయం ఉపాధి పథకాల కోసం దర్బార్‌కు ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

రామయ్యను దర్శించుకున్న ఐఏఎస్ అధికారి

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని ఐఏఎస్ అధికారి, రాష్ట్ర హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ కమిషనర్ ఎం.ఎం.నాయక్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూల మూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ సిబ్బంది లింగాల సాయిబాబ, బుద్ధా నర్సింహారావు, అర్చకులు పాల్గొన్నారు.

మొక్కల రాజశేఖర్‌కు అభినందన

చుంచుపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రకృతి హరిత దీక్ష ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయం వన విహార్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకుడు కొట్టూరి రాజశేఖర్‌ను డీఎఫ్‌ఓ లక్ష్మణ్ రంజిత్ నాయక్ అభినందించారు. మున్సిపల్ ఎస్‌ఐ మూడ్ అశోక్ చౌహాన్, షేక్ దస్తగిరి, జయరామ్ నాయక్ పాల్గొన్నారు.

గర్భిణికి వైద్యం అందించని డాక్టర్

–డెలివరీ చేసిన నర్సులు

దమ్మపేట: నిండు గర్భిణి పురిటి నొప్పులతో ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే డాక్టర్ కనీసం వైద్య పరీక్షలు కూడా చేయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తులు, గర్భిణి బంధువుల కథనం ప్రకారం.. అంకపాలెం గ్రామానికి చెందిన వాడే నవ్య గర్భవతి కాగా సోమవారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబీకులు, ఆశ కార్యకర్త ఆమెను పట్వారిగూడెం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. కాగా, గర్భిణికి వైద్యం చేయకుండా డాక్టర్ నిర్లక్ష్యంగా ఆస్పత్రి నుంచి వెళ్లిపోయాడు. నొప్పులు ఎక్కువ కావడంతో నర్సు జయ మిగతా సిబ్బంది డెలివరీ చేయగా, పాప జన్మనిచ్చింది. కాగా, డాక్టర్ దివాకర్ తీరుపై జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పీహెచ్‌సీ డాక్టర్ దివాకరన్‌ను వివరణ కోరగా.. కాన్పు చేసేటప్పుడు తాను అక్కడే ఉన్నానని, సాధారణ ప్రసవమే జరిగిందని తెలిపారు. తన విధులు ముగిశాక కూడా గంటన్నరపాటు ఆస్పత్రిలోనే ఉన్నానని పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

కొత్తగూడెంటౌన్: ఇంటి అద్దె అడిగినందుకు యజమానురాలిని తీవ్రంగా గాయపరిచి హత్య చేసిన వ్యక్తికి జీవితఖైదుతోపాటు రెండు వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సోమవారం తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా.. కొత్తగూడెం బర్లీఫీట్ ఏరియాకు చెందిన తిప్పనపల్లి రామశంకర్ తల్లి కనకమ్మ ఇంట్లో జూలూరుపాడు మండలం మాచినపేటకు చెందిన భూక్య బాబూలాల్ అద్దెకు ఉంటున్నాడు. 27.4.2016న అద్దె విషయమై జరిగిన గొడవలో బాబూలాల్ కనకమ్మపై దాడి చేశాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి మృతి చెందింది. రామశంకర్ ఫిర్యాదు మేరకు కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పది మందిని విచారించగా నేరం రుజువుకావడంతో బాబూలాల్‌కు జీవితఖైదుతో పాటు రెండు వేల రూపాయలను జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పోసాని రాధాకృష్ణమూర్తి వాదించారు. కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్.వీరబాబు, కోర్టు పీసీ కామేశ్వరావు సహకరించారు.

సింగరేణిలో 'దశాబ్ది' సంబురాలు

- కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో వేడుకలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు ఏరియాల్లో ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. అమరవీరులకు నివాళులర్పించారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా వెల్ఫేర్ విభాగం ఆధ్వర్యంలో ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ హాజరై మాట్లాడారు. తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికులు తమ వేతనాలను త్యాగం చేసి ముఖ్యమంత్రి కేసీఆర్ వెన్నంటి ఉండి ఉద్యమ స్ఫూర్తి నింపారని గుర్తుచేశారు. సీఎం సారథ్యంలో సింగరేణి అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో ప్రైవేటీకరణ చేయాలని చూస్తున్న ప్రయత్నాలు, సింగరేణి మణిహారాన్ని రాబందుల్లా తన్నుకుపోవాలని కొందరు చేస్తున్న కుట్రలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం కేంద్రం సింగరేణిని ప్రైవేటీకరణ చేయటం సాధ్యం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు, జీఎంలు, అధికారులు పాల్గొన్నారు.



కొత్తగూడెం: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

● మణుగూరులో..

మణుగూరు రూరల్: దేశానికి తలమానికంగా సింగరేణి సంస్థ ఉందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండలంలోని పీవీ కాలనీ భద్రాద్రి స్టేడియంలో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి సంబురాలు నిర్వహించారు. ఈ సంబురాలకు ఎమ్మెల్యే రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సింగరేణి ప్రగతి ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి సంస్థ రోజురోజుకు దినదినాభివృద్ధి చెందడమే కాకుండా ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సింగరేణిని లాభాల బాటలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు.


మణుగూరు: జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

● ఇల్లెందులో

ఇల్లెందు: తెలంగాణ అవతరణ వేడుకల్లో భాగంగా సోమవారం ఇల్లెందులోని సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో సింగరేణి సంబురాలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి, అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగదాంబా సెంటర్ నుంచి సింగరేణి స్కూల్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో జాతీయ జెండా ఎగురవేశారు. సింగరేణి లఘు చిత్రాన్ని ప్రారంభించి, ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. కారుణ్య నియామకాల ద్వారా ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. గృహ నిర్మాణానికి రూ.10 లక్షల వడ్డీ చెల్లింపు పత్రాలు కార్మికులకు అందజేశారు. సింగరేణి దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మహిళలకు నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వేడుకలను ప్రారంభించిన ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకమైన సకల జనుల సమ్మెలో సింగరేణి కార్మికులు వీరోచితంగా పోరాడారని గుర్తుచేశారు. సింగరేణిని అభివృద్ధి బాటలో పయనింపచేస్తూ సీఎం కేసీఆర్ కార్మిక వర్గ పక్షపాతిగా నిలిచారని పేర్కొన్నారు. ఇల్లెందులో నూతన ఓసీ ఏర్పాటుకు సహకరిస్తున్న అధికారులను అభినందించారు. సింగరేణి ఏరియా జీఎం షాలేము రాజు మాట్లాడుతూ త్వరలోనే జేకే ఓసీ పొడగింపు ప్రాజెక్ట్ ప్రారంభవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు జి. మధురవాణి, అధికారులు మల్లారపు మల్లయ్య, పంజాల శ్రీనివాస్ జీవీ మోహన్‌రావు, శ్రీహరి, కార్మిక నాయకులు ఎస్.రంగనాథ్, కె. సారయ్య, లింగాల జగన్నాధం, నాయని సైదులు, బాల ప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ అజ్మీర కిషోర్, కోటా సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

చార్ నంబర్.. చోర్

సుజాతనగర్ చోరీలో నలుగురు?

- ఇద్దరు షాపులోకి ప్రవేశించగా, మరో ఇద్దరు కాపలా
- చోరీ అనంతరం కారులో ఖమ్మం వైపు పరార్
- సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు
- దర్యాప్తులో వేగం పెంచిన పోలీసులు


గ్యాస్ కట్టర్‌తో కట్ చేసిన లాకర్

సుజాతనగర్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సుజాతనగర్ నగల దుకాణంలో చోరీ కేసులో పోలీసులు దర్యాప్తులో వేగం పెంచారు. స్థానికంగా వివిధ ప్రదేశాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి, చోరీ ఘటనలో నలుగురు నిందితులు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఇద్దరు నిందితులు మూతికి గుడ్డలు కట్టుకుని షాపులోకి రాగా, మరో ఇద్దరు దుకాణానికి ఇరువైపులా కాపలా ఉన్నట్లు తెలుస్తోంది. నిలబడి ఫోన్‌లో మాట్లాడుతూ, సిగరేట్ తాగుతూ చాలా సేపు ఉండిపోయినట్లు సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలో నిక్షిప్తమైన దృశ్యాలు ఇందుకు బలాన్ని చేకూర్చుతున్నాయి. నగల షాపు పక్క గదిని అద్దెకు తీసుకున్న ఇద్దరు వ్యక్తులు రెండు, మూడు రోజుల ముందే ఆ ప్రాంతంలో సంచరించినట్లు సమాచారం. నిందితులు ఉపయోగించిన కారు ఖమ్మం వైపుగా వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గ్యాస్ కట్టర్లు, గ్యాస్ సిలిండర్లు ఎక్కడ నుంచి తెచ్చారనే కోణంలో కూడా విచారణ సాగిస్తున్నారు. కాగా నిందితులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారుగా పోలీసులు భావిస్తున్నారు.

పక్కా ప్లాన్ ప్రకారమే

చోరీ జరిగిన తీరును పరిశీలిస్తే పక్కా ప్లాన్ ప్రకారమే చేసినట్టు అర్థమవుతోంది. ఉత్తర భారత దేశానికి వచ్చిన వ్యక్తులు వచ్చీరానీ తెలుగులో మాట్లాడుతూ సుజాతనగర్‌లో అద్దె ఇల్లు కావాలని తిరిగారు. చివరకు నగలషాపు పక్కనే ఉన్న గదిని 2023, మే 26న అద్దెకు తీసుకున్నారు. చోరీకి అవసరమైన గ్యాస్‌కట్టర్లు, గునపాలు, పారలు, తట్టలు తదితర సామగ్రి అంతా అక్కడికి తెచ్చుకున్నారు. గది అద్దెకు తీసుకున్న ఐదు రోజుల్లోనే.. సరిగ్గా నగల షాపు ఓనర్ ఊరికి వెళ్లిన మరుసటి రోజు.. ఈ నెల 1న రాత్రి 11 గంటలకు చోరీ చేశారు.

అపరిచితులకు పని, ఇల్లు అద్దెకు ఇవ్వాలంటే..

గడిచిన కొన్నేళ్లుగా సెక్యూరిటీ గార్డ్, పని మనిషి, డ్రైవరు పని చేస్తామంటూ, అద్దె ఇళ్లు కావాలంటూ ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు హైదరాబాద్ సహా పలు ప్రదేశాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. దీంతో ఇతర ప్రాంతాల వ్యక్తులను పని మనుషులగా నియమించుకునేప్పుడు.. సదరు వ్యక్తుల ఫొటోలతోపాటు ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు తదితర జిరాక్స్ కాపీలను యజమానులు తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాలి. సదరు వ్యక్తుల క్రిమినల్ రికార్డులు పరిశీలించిన తర్వాత పోలీసుల నుంచి అనుమతి వస్తే వారికి పని/ఇళ్లు ఇవ్వాలి. ఒకవేళ ముందుగా ఎటువంటి క్రిమినల్ రికార్డు లేకపోయినా... ఆ తర్వాత విచారణ వేగవంతంగా చేపట్టేందుకు ఈ ప్రక్రియ సహకరిస్తుంది. మరోవైపు రాష్ట్ర విభజనకు ముందే అమల్లోకి తెచ్చిన పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ ప్రకారం.. ఒకేసారి వంద మందికి పైగా రాకపోకలు సాగించే వాణిజ్య సముదాయాలు, ఫంక్షన్ హాళ్లు, సినిమా థియేటర్లు, ఆస్పత్రులు తదితర ప్రదేశాల్లో కచ్చితంగా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. వీటి పుటేజీని సైతం 30 రోజుల వరకు డిలీట్ కాకుండా భద్రపరచాలి. తెలంగాణ వచ్చాక పోలీసు శాఖ ఈ యాక్టును దృష్టిలో ఉంచుకుని విరివిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించింది.

నగల దుకాణం మినహా భవనంలో సీసీలు లేవు..

ఇక సుజాతనగర్ నగల దుకాణం చోరీ విషయానికి వస్తే, ఇతర ప్రాంతానికి చెందిన అపరిచిత వ్యక్తులకు గదిని అద్దెకు ఇచ్చే సమయంలో ఇంటి యజమాని నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు తెలుస్తోంది. ఫొటోలు, ఆధార్ వంటి గుర్తింపు కార్డులు ఏవీ తీసుకోలేదని సమాచారం. నగల దుకాణం ఉన్న వాణిజ్య సముదాయంలో కేవలం నగల షాపులో తప్ప మరెక్కడా సీసీ కెమెరాలు లేవు. దీంతో చోరీ చేయడం సులువుగా మారింది. ఎక్కడి నుంచో వచ్చిన వారు కేవలం వారం రోజుల్లో రూ. 87 లక్షల ఆభరణాలు చోరీ చేసి ఉడాయించారు.

భార్యను హతమార్చిన భర్త

చర్ల: భార్యను భర్తే నైలాన్ తాడుతో ఉరి వేసి హతమార్చిన ఘటన చర్ల మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబీకుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం గేటు లక్ష్మీపురం గ్రామానికి చెందిన పాతకట్ల రవి ములుగు జిల్లా వాజేడు మండలం ప్రగళ్లపల్లికి చెందిన కొత్తగట్ల సుజాత (27)ను పదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. రవి కొంతకాలంగా చర్ల మండల కేంద్రంలో ఓ యూట్యూబ్ చానెల్‌లో విలేకరిగా పని చేస్తున్నాడు. కాగా, మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని సుజాతను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి తన భార్య కళ్లు తిరిగి కిందపడిందని ఇరుగు పొరుగు వారికి తెలియజేయగా, వారు వచ్చి చూసేసరికి సుజాత మృతిచెంది ఉంది. ఈ విషయాన్ని ప్రగళ్లపల్లిలో ఉన్న సుజాత కుటుంబసభ్యులకు స్థానికులు సమాచారం అందించగా వారు సోమవారం ఉదయం వచ్చారు. అయితే సుజాత మెడ కింది భాగంలో నైలాన్ తాడుతో గొంతు బిగించిన ఆనవాళ్లు కనిపించడంతో రవిని నిలదీయడంతో పాటు దేహశుద్ధి చేశారు. దీంతో రవి వారి నుంచి తప్పించుకుని పారిపోయాడు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చర్ల సీఐ అశోక్ తెలిపారు.

భూ వివాదం : ఆరుగురిపై కేసు

పాల్వంచరూరల్: భూ వివాదంలో ఆరుగురిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని సీతానగర్ కాలనీకి చెందిన అజ్మీర లక్‌పతి 2014లో రంగాపురంలో జలగం ప్రియాంక వద్ద 416.66 గజాల భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమిని శుభ్రం చేయిస్తుండగా అదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు వచ్చి బూతులు తిట్టారు. భూమిని ఆక్రమించే ప్రయత్నం చేయడంతో లక్‌పతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

టేకులపల్లి: రోళ్లపాడు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని తొమ్మిదోమైలుతండా పంచాయతీ కోటల్ల గ్రామానికి చెందిన చీమల పుల్లయ్య(53) రోళ్లపాడు చేపల చెరువు సొసైటీ సభ్యుడిగా ఉన్నాడు. నాలుగు రోజుల క్రితమే ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లేదు. సోమవారం రాత్రి రోళ్లపాడు చెరువులో శవమై తేలాడు. గ్రామస్తుల సమాచారంతో వెళ్లిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య బుచ్చమ్మ, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పుల్లయ్య కుమారుడొకరు గతంలో ఇదే చెరువులో పడి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రమణారెడ్డి తెలిపారు.

ఉరివేసుకుని ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం... మండలంలోని ఊట్లపల్లికి చెందిన కొవ్వాసి నరసింహారావు(42) కొద్ది రోజుల నుంచి అతిగా మద్యం తాగుతున్నాడు. సోమవారం కూడా మద్యం తాగి భార్యతో వాగ్వాదం పెట్టుకున్నాడు. ఆ తర్వాత ఇంట్లోకి వెళ్లి తలుపులు మూసుకుని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబీకులు, చుట్టు పక్కల వారు వచ్చి తలుపులు పగులకొట్టి తెరిచేలోపు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతుని సోదరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం జరిపించారు.

వైభవంగా ఆధ్యాత్మిక దినోత్సవం

- ఈనెల 21న ఆలయాల్లో హోమాలు, అభిషేకాలు, పూజలు
- అర్చక, ఉద్యోగుల సమావేశంలో దేవాదాయ శాఖ ఏసీ సులోచన

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21వ తేదీన ఆలయాల్లో ఆధ్యాత్మిక దినోత్సవం వైభవంగా నిర్వహించేందుకు సిద్ధం కావాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఏ.సులోచన సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో సోమవారం ఆమె ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులు, ఉద్యోగులు, అర్చకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సులోచన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 85 దేవాలయాలు, ధూప దీప నివేదన పరిధిలోని 310 దేవాలయాల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రుద్రాభిషేకాలు, సుదర్శన హోమాలు, కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు చేయాలని, ఇందులో ఈఓలు, ఉద్యోగులు, అర్చకులు ప్రధాన భూమిక పోషించాలని తెలిపారు. ఆలయ కమిటీల సహకారంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టి ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఈ సమావేశంలో శాఖ సూపరింటెండెంట్ గౌరీశంకర్, ఇన్‌స్పెక్టర్లు సమత, వెంకటేశ్వర్లు, ఉద్యోగులు ఆనంద్, కొత్తూరు జగన్మోహన్‌రావు, చుండూరు రామకోటేశ్వరరావు, ఉద్యోగ, అర్చక సంఘాల సంఘాల ప్రతినిధులు తోటకూర వెంకటేశ్వర్లు, బి.మురళి, రామారావు, రాధాకృష్ణశర్మ, దాములూరి వీరభద్రరావు, రామశర్మ, నరహరి రామకృష్ణమాచార్యులు, ప్రసాద్‌శర్మ, భార్గవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.


అర్చక, ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ సులోచన

గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టాలు

తహసీల్‌లో నేడు దరఖాస్తుల స్వీకరణ

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు, వెంకటాపురం, మామిళ్లవాయి గ్రామాల్లోని 71, 27 సర్వే నంబర్లలో 500 మంది గిరిజన రైతులు సాగు చేస్తున్న 1000 ఎకరాల ప్రభుత్వ భూమికి అసైన్‌మెంట్ పట్టాలకు సంబంధించి మంగళవారం గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. దరఖాస్తుదారుల వేలిముద్రలతోపాటు పూర్తి వివరాలు ఆన్‌లైన్ చేయనున్నారు. త్వరలో గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టాలు అందజేయనున్నారు. 71,27 సర్వే నంబర్లలో 1000 ఎకరాల ప్రభుత్వ భూమిని గిరిజనులు తరతరాలుగా సాగు చేసుకుంటున్నారు. 1977లో గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చారు. తర్వాత ఆ భూమి తమ శాఖ పరిధిలో ఉందని ఫారెస్ట్ అధికారులు ఆధీనంలోకి తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవ తీసుకొని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి, భూమి రెవెన్యూ శాఖదిగా నిర్ధారించారు. ఎమ్మెల్యే రేగా కృషితో అసైన్‌మెంట్ పట్టాల పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ వచ్చింది. నేడు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్ అనుదీప్ పర్యవేక్షించనున్నారు. ఈ మేరకు తహసీల్దార్ రాజు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది సోమవారం కార్డులు పరిశీలించి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశారు.


తహసీల్దార్ కార్యాలయంలో భూముల రికార్డులు పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆశ్రమ పాఠశాలల్లో ఎస్‌ఏల సర్దుబాటు

భద్రాచలం: గిరిజన పాఠశాలల పరిపాలనా సౌలభ్యం కోసం ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో ఉపాధ్యాయుల కొరత ఉన్నచోట స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేసినట్లు ఐటీడీఏ ఏపీఓ జనరల్, ఇన్‌చార్జ్ డీడీ, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ వెల్లడించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం కొత్తగా ఏర్పాటైన(కన్వర్టెడ్) ఆరు ఆశ్రమ పాఠశాలలకు గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల నుంచి స్కూల్ అసిస్టెంట్లను కేటాయించేలా సీనియర్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీనియారిటీ ప్రకారం వారు కన్వర్టెడ్ పాఠశాలల్లో హెచ్‌డబ్ల్యూలుగా, ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని డేవిడ్‌రాజ్ తెలిపారు. ఈమేరకు ఏజీహెచ్‌ఎస్ భద్రాచలం, అశ్వారావుపేట, బూర్గంపాడు, మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెం ఏజీయూపీఎస్ పాఠశాలల్లో ఐదుగురు, బాలుర పాఠశాలలో ఒకరిని సర్దుబాటు చేయగా, మంగళవారం నుంచి కేటాయించిన స్థానాల్లో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఎంఓ రమణయ్య, జూనియర్ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు.


ఉపాధ్యాయుల సీనియారిటీ పత్రాలు పరిశీలిస్తున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

అధ్వానంగా రోడ్డు.. అంబులెన్సూ రావట్లే


రాస్తారోకో చేస్తున్న ఆంజనేయపురం గ్రామస్తులు

అసంపూర్తి రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలని ఆందోళన

ఇల్లెందురూరల్: ఐదేళ్లుగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేసిన తీరును నిరసిస్తూ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మండలంలోని ఆంజనేయపురం గ్రామస్తులు సోమవారం ముకుందాపురం క్యాంప్‌సెంటర్‌లో ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. మండుటెండలోనే గంటపాటు రాస్తారోకో చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఇల్లెందు సీఐ కరుణాకర్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. రహదారి అధ్వానంగా ఉండటంతో గ్రామానికి కనీసం అంబులెన్స్ కూడా రావడం లేదని, ఆటోలు రావడం లేదని, పిల్లలు పాఠశాలలకు, రోగులు ఆస్పత్రికి వెళ్లడం సమస్యగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు కోసం ఇంకా ఎన్నాళ్లు ఎదురుచూడాలని ప్రశ్నించారు. ఒక దశలో సీఐతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, సత్వరమే పరిష్కరించేందుకు పోలీసుశాఖ కూడా కృషి చేస్తోందని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు శాంతించారు.